నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 నల్లగొండ, సోమవారం 11 మార్చి 2024 NALGONDA

## అంగరంగ వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 10 : మేళ్లచెర్వులో శంభు లింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం ఎదుట రథాంగ పూజ, రథాంగ హోమం, బలిహరణ పూజలను అర్చకులు రాధాకృష్ణమూర్తి, విష్ణువర్థన్ శర్మ, ధనుంజయ శర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను రథంపై నిలిపి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మంగళ వాయిద్యాలు, వేద బ్రాహ్మణుల మంత్రాల నడుమ రథయాత్ర సాగింది. అంతకు ముందు ఉదయం అభిషేకాలు, అర్చనలు తదితర కార్యక్రమాలు జరిగాయి. జాతర మూడో రోజూ ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. టీటీడీ కల్యాణ మండపంలో అన్నదానం కొనసాగింది. శనివారం అర్ధరాత్రి దాకా వేసిన బాల నాగమ్మ నాటకం వీక్షకులను ఆకట్టుకున్నది

### ఉత్సాహంగా ఎద్దుల పందేలు, కబడ్డీ పోటీలు

మేళ్లచెర్వు జాతర సందర్భంగా ఆదివారం నాలుగు పళ్లు, ఆరు పళ్ల విభాగాల్లో ఎద్దుల పందేలు ఉత్సాహంగా సాగాయి. మరో వైపు కబడ్డీ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. పోటీలను వీక్షించేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు.

## రేపటి నుంచి విద్యార్థులకు పర్యావరణ అధ్యయనంపై నేచర్ క్యాంప్

రామగిరి, మార్చి 10 : విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన పెంచేలా భారత ప్రభుత్వ పర్యావరణ, అడవులు, సుస్థిర అభివృద్ధి మంత్రిత్వ శాఖ –న్యూఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర జాతీయ హరిత దళాలు– హైదరాబాద్ సంయుక్తంగా ఈ నెల 12 నుంచి మూడు రోజులపాటు నేచర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు డీఈఓ బి.భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎంపిక చేసిన 5 ఎన్‌జీసీ పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు ఈ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. నాగార్జున సాగర్‌లో పర్యావరణంపై అటవీశాఖ అధికారులతో ఫీల్డ్‌లోకి తీసుకవెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి(ఫోన్ నంబర్ 9848578845)ని సంప్రదించాలన్నారు.

### ఎంపికైన పాఠశాలలు

ప్రభుత్వ ఉన్నత పాఠశాల– బొట్టుగూడ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల – కేశరాజుపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల– కొత్తపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల– మేళ్లదుప్పలపల్లి, ప్రభుత్వ ఎస్‌వీఏఆర్ మోడల్ ఉన్నత పాఠశాల –పైలాన్ ఎంపికైన వాటిలో ఉన్నాయి. ప్రతి పాఠశాల నుంచి 10మంది విద్యార్థులు ఒక గైడ్ టీచర్ శిక్షణలో పాల్గొంటారని డీఈఓ తెలిపారు.

# బ్రహ్మోత్సవ వైభవం

- నేడు యాదగిరి గుట్టలో వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం
- విశ్వక్సేనారాధన, స్వస్తివాచనంతో ప్రారంభం
- ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి.. రూ. 1.60 కోట్లు కేటాయింపు
- తొలి పూజల్లో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు



విద్యుత్ వెలుగుల్లో యాదగిరిగుట్ట ఆలయం



పూలతో తీర్చిదిద్దుతున్న ఆలయ ముఖ మండపం

యాదగిరిగుట్ట, మార్చి10 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నేడు ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10 గంటలకు రుత్వికులు, పారాయణదారులు, వేద పండితులు, పురోహితులు, ఆలయ అధికారులు కలిసి స్వయంభూ పంచ నారసింహ స్వామి అనుమతి తీసుకొని, ప్రధానాలయ ముఖ మండపంలో విశ్వక్సేనారాధన, స్వస్తివాచనం, రక్షాబంధనంతో వేడుకలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 21 వరకు 11 రోజులపాటు వివిధ కార్యక్రమాలు చేపట్టనుండగా డోలు వాయిద్యాలు, సన్నాయి మేళాలు, వేద మంత్ర పఠనాలతో ఆలయం ఆధ్యాత్మిక వైభవం సంతరించుకోనున్నది. ఉత్సవాల కోసం దేవస్థానం రూ. 1.50 కోట్లు కేటాయించగా, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ రామకృష్ణారావు తెలిపారు. తొలి పూజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. బేగంపేట విమానాశ్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉదయం 8.45 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 9 గంటలకు టెంపుల్ సిటీ హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి వాహనంలో కొండపైకి వస్తారు. 9.30 నుంచి 10.30 గంటల వరకు స్వామివారి బ్రహ్మోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. ముఖ్యమంత్రి తొలిసారిగా స్వామివారిని దర్శించుకునేందుకు వస్తున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

### సర్వాంగ సుందరంగా..

బ్రహ్మోత్సవాల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రూ.1.50 కోట్లలో రూ. 60 లక్షలు విద్యుద్దీపాలంకరణకు, మిగతా రూ. కోటి స్వామివారి పూజలకు ఖర్చు చేయనున్నారు. రంగురంగుల విద్యుద్దీపాలంకరణతో ఆలయం ధగధగ మెరిసిపోతున్నది. స్వామివారి సేవలను వినియోగించే వాహనాలను ఇప్పటికే సిద్ధం చేశారు. ప్రధానాలయాన్ని మామిడి తోరణాలు, రంగురంగుల పూలతో ఆలంకరించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఎదురుగా యాగశాలను ఏర్పాటు చేశారు. వేసవికాలం ప్రారంభం కావడంతో చలువ పందిళ్లు, తాగునీటి వసతులను కల్పించారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు యాదగిరిగుట్ట అంతా ప్రతిధ్వనించేలా ప్రత్యేకమైన సౌండ్ సిస్టంను ఏర్పాటు చేశారు. కొండపైనే ప్రత్యేకంగా మొబైల్ టాయిలెట్స్‌ను అందుబాటులో ఉంచారు.

### కల్యాణ టికెట్లు 600

బ్రహ్మోత్సవంలో భాగంగా ఈ నెల 18న తిరు కల్యాణోత్సవానికి 600 కల్యాణ టికెట్లను మాత్రమే భక్తులకు అందుబాటులో ఉంచారు. ఒక్కో టికెట్ ధర రూ. 3 వేలు నిర్ణయించగా నేటి నుంచి దేవస్థాన వైబ్‌సైట్‌లో అందుబాటులోకి రానున్నాయి. వీటితోపాటు కొండపై టికెట్ కౌంటర్ వద్ద సైతం టికెట్లను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణం అనంతరం దాతలకు శేష వస్త్రంగా ఒక ఉత్తరీయం, కనుము, అభిషేకం లడ్డూ, 2 వడలు ప్రసాదంగా ఇవ్వనున్నారు. కల్యాణోత్సవంలో 5 వేల మంది భక్తుల పాల్గొనే విధంగా ప్రత్యేక గ్యాలరీలను రూపొందించారు. వీవీఐపీ, వీఐపీ, కల్యాణంలో పాల్గొనే భక్తులు, అర్చకులు, డోనర్లు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు ప్రత్యేకమైన లాబీలు ఏర్పాటు చేస్తున్నారు. తూర్పు పంచతల రాజగోపురం ఎదురుగా ఎదుర్కోలు, ఉత్తర పంచతల రాజగోపురం ఎదురుగా గల రథశాల, లిఫ్ట్ ముందు భాగంలో స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

### పట్టువస్త్రాల సమర్పణ

లక్ష్మీనరసింహ స్వామికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సమర్పించనున్నారు. ఆలయం తరఫున అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున టీటీడీ ఆలయ ఈఓ, పోచంపల్లి చేనేత సంఘం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందజేయనున్నారు.

### రోజుకు 1500 మందికి అన్నదానం

ఆలయంలో ప్రతి రోజూ 500 మందికి మాత్రమే అన్నదానం చేస్తుండగా వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో 1500 మందికి అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. కొండకింద నిత్యన్నదాన సత్రంలో ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం ఉంటుందని ఆలయ ఈఓ రామకృష్ణారావు వెల్లడించారు.

### 15 నుంచి ధార్మిక సాహిత్య సంగీత మహాసభలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 15నుంచి 20 వరకు ధార్మిక, సాహిత్య సంగీత మహాసభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 5.30 నుంచి 6.30 వరకు యాదగిరిగుట్టకు చెందిన శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాత భేరి, ఆస్థానం వారితో మంగళ వాయిద్యాలు, వైదిక ప్రార్థనలు నిర్వహిస్తారు. వీటితోపాటు ప్రతి రోజూ ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తి, కర్ణాటక సంగీతాలు, కూచిపూడి, పేరిణి నృత్యాలు, భరతనాట్యం, ఉపన్యాసాలు, హరి కథలు, వీణా వాద్యం, వేణుగానం, మంగళవాయిద్య గోష్టి, చిందు యక్షగానం, కోలాటం, చెక్కభజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

### చక్రతీర్థ స్నాన ఘట్టానంతరం భక్తులకు పుణ్యస్నానాలకు అనుమతి

గత బ్రహ్మోత్సవాల సమయంలో చక్రతీర్థ స్నాన సమయంలోనే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే ఆనవాయితీ ఉండేది. కానీ కొండపైన విష్ణు పుష్కరిణి తక్కువ వైశాల్యంతో నిర్మించిన నేపథ్యంలో గతేడాది బ్రహ్మోత్సవాల్లో చక్రతీర్థ స్నాన ఘట్టాన్ని పరిమిత సంఖ్యలో అర్చకులు, అధికారుల నడుమ కొండపైన విష్ణు పుష్కరిణిలో నిర్వహించారు. అనంతరం పుణ్య జలాలను కలశంతో నింపి లక్ష్మీ పుష్కరిణిలో కలిపారు. కానీ ఈ సారి చక్రతీర్థ స్నాన ఘట్టం ముగిసిన అనంతరం విష్ణుపుష్కరిణిలోనే భక్తుల పుణ్య స్నానాలకు అనుమతిని ఇవ్వనున్నట్లు ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి వెల్లడించారు.

### బ్రహ్మోత్సవాలపై పరీక్షల ప్రభావం

యాదగిరిగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలకు పరీక్షల ప్రభావం పడనున్నది. ఇంటర్మీడియట్, పదో తరగతి, డిగ్రీ, పీజీ సెమిస్టర్‌తోపాటు మెగా డీఎస్సీ, గ్రూప్ 1,2,3 ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో విద్యార్థులు, నిరుద్యోగులు పరీక్షలకు సన్నద్ధం కానున్నారు. దాంతో ఈ సారి ఉత్సవాలను భక్తుల సంఖ్య తగ్గే అవకాశం ఉన్నదని ఆలయ, ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.

### రద్దీకి అనుగుణంగా బస్సులు

బ్రహ్మోత్సవాలకు భక్తులు హైదరాబాద్, నల్లగొండ నుంచి ఎక్కువగా వస్తారని, ఆ రూట్లలో అధికంగా బస్సులు నడిపించేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా గుట్టకు బస్సులు నడుస్తున్నాయి. ప్రస్తుతం కొండపైకి 10 నుంచి 12 ఉచిత ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాదగిరిగుట్ట బస్టాండ్ నుంచి కొండపైకి భక్తులు రద్దీకి అనుగుణంగా నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### నేడు కొండపైన ఆంక్షలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలకు వస్తున్న నేపథ్యంలో కొండపైన దేవస్థానం ఆంక్షలు విధించింది. సోమవారం ఉదయం 8 నుంచి 11 గంటలవరకు దర్శనాలు నిలిపివేస్తున్నట్లు ఈఓ రామకృష్ణారావు తెలిపారు. కొండపైకి భక్తులను, ఎటువంటి వాహనాలను అనుమతినివ్వడం లేదని చెప్పారు.

### యథావిధిగా స్వామివారి దర్శనాలు : ఈఓ రామకృష్ణారావు

వార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని స్వామి వారి దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయి. బ్రేక్ దర్శనంతోపాటు ధర్మ దర్శనాలు, ప్రత్యేక దర్శనాలు ఉంటాయి. నేటి నుంచి 21వరకు నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహహోమం, మొక్కు సేవలను రద్దు చేస్తున్నాం. స్వామివారి రాత్రి నివేదన అర్చన తదుపరి 8.15 నుంచి 9.00 గంటల వరకు బలి హరణ, ఆరగింపు జరిపించనున్నాం. రాత్రి 7 గంటలకు అలంకార సేవలు, సర్వ దర్శనాలు ప్రారంభిస్తాం. రాత్రి 10 గంటలకు శయనోత్సవ సేవ, ద్వార బంధనం ఉంటుంది.

### రైల్వే ప్రయాణం ఇలా..

ఇటు హైదరాబాద్, ఆటు వరంగల్ నుంచి వచ్చే భక్తులకు రైల్వే సౌకర్యం కలదు. జిల్లా కేంద్రమైన భువనగిరితో పాటు స్వామి వారి దేవస్థానానికి 5 కిలో మీటర్ల సమీపం రాయగిరిలో యాదాద్రి రైల్వే స్టేషన్ ఉన్నది. సికింద్రాబాద్ నుంచి వచ్చే రైళ్లు కాకతీయ ప్యాసెంజర్, పుష్‌పుల్, కృష్ణా ఎక్స్‌ప్రెస్ యాదాద్రి రైల్వే స్టేషన్‌లో నిలుపుతారు. సికింద్రాబాద్ నుంచి వరంగల్ వెళ్లే పుష్‌పుల్, గోల్కొండ, భాగ్యనగర్, కాకతీయ, గౌతమి, మంచిర్యాల, కృష్ణా, ఇంటర్ సిటీ, తెలంగాణ, ఈస్ట్‌కోస్ట్, దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు భువనగిరి రైల్వేస్టేషన్‌లో నిలుపుతారు. వరంగల్ నుంచి వచ్చే రైళ్లు సైతం భువనగిరిలో ఆగుతాయి. భువనగిరి నుంచి బస్సు సహాయంతో యాదగిరిగుట్టకు చేరుకోవచ్చు.



దేవరకొండ రూరల్ : రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలూనాయక్

## డిండి ప్రాజెక్టు పనులు మూడేండ్లలో పూర్తి

- ప్రతి తండాకు రోడ్డు.. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

దేవరకొండ రూరల్/మాల్, మార్చి10 : పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి తండాకు రోడ్డు వేస్తామని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. దేవరకొండ మండల కేంద్రం డిండి క్రాస్‌రోడ్డులో మండలంలోని మైనంపల్లి నుంచి డిండి క్రాస్‌రోడ్డు వరకు రూ.14 కోట్లతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనులకు ఆదివారం ఎమ్మెల్యే బాలూనాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అంతకుముందు మంత్రి పట్టణంలోని శ్రీ గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. డిండి ప్రాజెక్టు పనులు మూడేండ్లలో పూర్తి చేస్తానన్నారు. దేవరకొండ నియోజక వర్గంలో గిరిజనులు ఎక్కువగా ఉన్నందున వారికి ప్రభుత్వ కార్యాలయాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. వేసవిలో నీటి సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి చింతపల్లి మండలంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో దేవరకొండ మున్సిపల్ చైర్మన్‌ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీలు జాన్‌యాదవ్, పార్వతీచందూనాయక్, కొండూరి భవానీపవన్ కుమార్, ఎంపీటీసీ కొర్ర గౌతమిరాం సింగ్, నాయకులు అంగిరేకుల నాగభూషణం, కాయితి జితేందర్ రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

## బీసీల హక్కుల సాధనకు నేడు రౌండ్ టేబుల్ సమావేశం

- హాజరుకానున్న జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

రామగిరి, మార్చి 10 : బీసీల హక్కుల సాధన కోసం సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా రౌండ్ టేబుల్ సమావేశాన్ని యునైటెడ్ పూలే ఫ్రంట్, భారత జాగృతి సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు భారత జాగృతి జిల్లా కన్వీనర్ బోనగిరి దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని చిన వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని, దీనికి ముఖ్య అతిథిగా భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. బీసీ, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

## టెన్త్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ఎగ్జామ్స్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 225 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 40,375మంది విద్యార్థులు
- సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ నియామకం పూర్తి
- ఆన్‌లైన్‌లో విద్యార్థుల హాల్ టికెట్స్



పాతర్లపహాడ్ జడ్పీహెచ్ఎస్‌లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

రామగిరి, మార్చి 10 : పదో తరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 225 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 40, 375 మది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షల పర్యవేక్షణకు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, కస్టోడియన్స్, రూట్ ఆఫీసర్స్‌ను నియమించారు. పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్లు ఇప్పటికే డీఈఓలతో కలిసి సీఎస్, డిపార్టుమెంట్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేశారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:15వరకు పరీక్షలు జరుగుతాయి. ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందంలో ఒక తాసీల్దార్, సీనియర్ గెజిటెడ్ హెచ్‌ఎం, పోలీసు అధికారులు ఉంటారు. ఉత్తమ ఫలితాల కోసం ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి చదివిస్తున్నారు.

### జంబ్లింగ్ పద్ధతిలో విద్యార్థుల కేటాయింపు

టెన్త్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంది. జంబ్లింగ్ పద్ధతిలో విద్యార్థులకు పరీక్ష కేంద్రాలను కేటాయించింది. ఉదాహరణకు ఒక పాఠశాలలో 45మంది టెన్త్ విద్యార్థులు ఉంటే ఆ సమీపంలోని 8 సెంటర్లలో కేంద్రాలు వచ్చేలా కార్యాచరణ అమలు చేసింది. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించే ఏర్పాటు చేసింది. విద్యార్థులకు హాల్ టికెట్స్ ఈ నెల 11నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. మరో వైపు జిల్లా విద్యాశాఖ కార్యాలయం పరీక్షల విభాగం నుంచి కూడా హాల్ టికెట్స్ ఈ నెల 11 వరకు ఎంఈఓలకు రానున్నాయి. వారు అక్కడి నుంచి సంబంధిత పాఠశాలలకు పంపిస్తారు.

### ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ నిఘా

పరీక్ష కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్ గదిలో ఏర్పాటు చేసే సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష ప్రశ్న పత్రాలను తెరువనున్నారు. పరీక్షల అనంతరం జవాబు పత్రాల ప్యాకింగ్ కూడా అక్కడే చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.

### అన్ని ఏర్పాట్లు చేశాం

జిల్లాలో 109 పరీక్ష కేంద్రాల్లో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకున్నాం. తాగు నీటితో ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచుతాం. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో అధికారులు తెలియజేశాం. ఆర్టీసీ బస్సులను పరీక్షల సమయంలో నడిపేలా సూచించాం. ఎక్కడా ఇబ్బంది లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశాం.

– బి.భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

| జిల్లా | పాఠశాలలు | పరీక్ష కేంద్రాలు | విద్యార్థులు |
|---|---|---|---|
| నల్లగొండ | 459 | 109 | 19,302 |
| సూర్యాపేట | 344 | 67 | 11,944 |
| యాదాద్రి భువనగిరి | 294 | 49 | 9,129 |
| మొత్తం | 1,097 | 225 | 40,375 |

## సజావుగా ఎస్సీ స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్ష



ప్రవేశ పరీక్షను పరిశీలిస్తున్న డీఎస్‌డబ్ల్యూఓ కె.లత

సూర్యాపేట అర్బన్, మార్చి 10 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో వివిధ పోటీ పరీక్షల కోసం ఉచిత శిక్షణ, వసతి పొందడానికి ఆదివారం స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష సజావుగా జరిగింది. దీనికోసం జిల్లా వ్యాప్తంగా 380మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 277మంది పరీక్షకు హాజరయ్యారు. 103మంది గైర్హాజరయ్యారు. ప్రవేశ పరీక్ష మార్కుల ద్వారా 100మంది అభ్యర్థులకు, డిగ్రీ మార్కుల ఆధారంగా మరో 100మంది అభ్యర్థులకు స్టడీ సెంటర్‌లో ప్రవేశం కల్పించనున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ చిట్టిపాక రాములు తెలిపారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు గ్రూప్స్‌తో పాటు ప్రభుత్వ ఉద్యోగాలకు కావాల్సిన శిక్షణ, వసతి కల్పించనున్నట్లు చెప్పారు. డీఎస్‌డబ్ల్యూఓ కె.లత పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. వారి వెంట ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశులు తదితరులు ఉన్నారు.

## బొట్టు బొట్టు ఒడిసి పట్టి

- నిమ్మ తోటను కాపాడుకునేందుకు రైతు భగీరథ ప్రయత్నం

శాలిగౌరారం, మార్చి 10 : కండ్ల ముందే కొమ్మలు మాడిపోతుంటే తట్టుకోలేని ఓ నిమ్మ తోట రైతు తోటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. అప్పు చేసైనా సరే కాపాడుకునేందుకు ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పడుతున్నాడు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామ పంచాయతీ పరిధి జోలంగూడేనికి చెందిన రైతు జోలం లింగయ్యకు మూడు ఎకరాల నిమ్మతోట ఉన్నది. గతంలో తోటను కాపాడుకునేందుకు 10 బోర్లు వేశాడు. పదిలో నాలుగు మాత్రమే పోస్తుండగా అవి కూడా భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ప్రస్తుతం ఆగి ఆగి పోస్తున్నాయి. ఈ నీటితో తోటను బతికించుకోలేననుకున్న లింగయ్య అదనంగా రూ.30వేలు ఖర్చు చేసి తోటలోనే జేసీబీ సహాయంతో 12 అడుగుల లోతు గుంటను తీశాడు. దీనికి తోడు నీళ్లు ఇంకిపోకుండా టార్పాలిన్‌ను గుంతలో పరిచి ఆగి ఆగి పోస్తున్న మోటర్లతో నీటిని డంప్ చేస్తున్నాడు. రెండ్రోజులు ఆపి మూడు ఎకరాల్లో ఉన్న 270 చెట్లకు నీళ్లు అందిస్తున్నాడు. 5రోజులకు ఒక్క తడి చొప్పున నీటిని పడుతున్నాడు. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో నీళ్లందియ్యడం కష్టతరం కానున్నట్లు రైతు లింగయ్య ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.





లింగయ్య, రైతు

తోట కోసం గుంత ఏర్పాటు చేసి మోటర్ల సాయంతో నీళ్లు నింపుతున్న రైతు లింగయ్య



కంఠ మహేశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

## కంఠ మహేశ్వర స్వామి దీవెనలు అందరిపై ఉండాలి

- ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

బొడ్రాయిబజార్, మార్చి 10 : కంఠ మహేశ్వర స్వామి కృపతో ప్రజలు, గౌడ కులస్తులు ఆనందంగా ఉండాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవం కంఠ మహేశ్వరస్వామి సురమాంబ కల్యాణోత్సవంలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తులంతా ఐక్యంగా ఉండి పెద్దఎత్తున తమ ఇష్ట దైవం కల్యాణం నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కెక్కిరేణి నాగయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బైరు వెంకన్నగౌడ్, మారిపెద్ది శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాలసైదులు, కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రాపర్తి పెద్ద శ్రీనివాస్, కోశాధికారి కెక్కిరేణి సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు ఎల్గూరి రాంబాబు, టైసన్ శ్రీను, కెక్కిరేణి ఆనంద్, బొమ్మగాని వెంకన్న, రాచకొండ నాగార్జున్, కృష్ణ, రాపర్తి దుర్గయ్యగౌడ్ పాల్గొన్నారు.

## రామలింగేశ్వరుడికి లక్ష పుష్పార్చన



చెర్వుగట్టు జడల రామలింగేశ్వరస్వామికి లక్ష పుష్పార్చన చేస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, మార్చి 10 : మండలంలోని చెర్వుగట్టు రామలింగేశ్వర స్వామి ఆలయం ఆదివారం అమావాస్య కావడంతో భక్తులతో కిక్కిరిసింది. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకొన్నారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఓ నవీన్ కుమార్ భక్తులకు మౌలిక వసతులు కల్పించారు.